ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
3
సోమవారం 8 జూలై 2024


అసంపూర్తి భవనాల మధ్య పెరుగుతున్న పిచ్చి మొక్కలు


కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద అసంపూర్తిగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ భవనం

ఉర్దూ వర్సిటీకి మంచి రోజులు

- శాపంగా మారిన గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
- ఈ వర్సిటీని ఎత్తేసి ఆర్‌యూలో విలీనం చేయాలనే ఎత్తుగడ
- 144 ఎకరాలు కబ్జాకు తెరవెనుక కుట్ర
- టీడీపీ ప్రభుత్వం రావడంతో ఉర్దూ విద్యార్థుల్లో చిగురిస్తున్న ఆశలు
- అసంపూర్తి పనులకు రూ.49 కోట్లు అవసరం

'ఉర్దూ యూనివర్సిటీకి 144 ఎకరాలు అవసరమా..? అసలు వర్సిటీనే అవసరం లేదు.. రాయలసీమ విశ్వవిద్యాలయంలో కలిపేసి ఉర్దూ విభాగం (డిపార్ట్‌మెంట్) పెడితే సరిపోదా...' గత వైసీపీ ప్రభుత్వంలో యూనివర్సిటీలపై సమీక్షా సందర్భంగా కీలక హోదాలో ఉన్న ఓ ప్రజాప్రతినిధి కలెక్టరుతో అన్న మాటలివి. అంటే రాష్ట్ర విభజన తరువాత ఆనాటి సీఎం చంద్రబాబు కర్నూలుకు ఉర్దూ యూనివర్సిటీ మంజూరు చేయడం.. ఓర్వకల్లు వద్ద 144 ఎకరాలు కేటాయించి శాశ్వత భవనాలు నిర్మాణం చేపట్టడం గత వైసీపీ ప్రభుత్వం పెద్దలకు ఏమాత్రం ఇష్టం లేదు. అందుకేనేమో ఉద్దేశపూర్వకంగా ఉర్దూ వర్సిటీ భవనాల నిర్మాణ పనులు ఆపేశారు. ఐదేళ్లలో ఉర్దూ వర్సిటీని వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసింది. జాతీయ రహదారి పక్కనే ఉన్న వర్సిటీ భూములు కొట్టేయాలనే కుట్రలో భాగంగానే ఉర్దూ వర్సిటీని నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో మళ్లీ టీడీపీ ప్రభుత్వం రావడంతో ఉర్దూ యూనివర్సిటీ నిర్మాణంపై ఆశలు చిగురిస్తున్నాయి. రూ.49 కోట్లు ఇస్తే ఏడాదిలోగా ఓర్వకల్లు కేంద్రంగా డాక్టరు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం విద్యార్థుల సేవలో తరిస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

కర్నూలు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఏకైక ఉర్దూ వర్సిటీ 'మౌలానా అజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ' హైదరాబాదులో ఉంది. రాష్ట్ర విభజన తర్వాత ఉర్దూ చదువుకోవాల్సిన ముస్లిం విద్యార్థులు హైదరాబాద్ వెళ్లాల్సిన పరిస్థితి. అప్పటి సీఎం చంద్రబాబు అత్యధిక ముస్లిం జనాభా కలిగిన కర్నూలులో ఉర్దూ విశ్వవిద్యాలయం స్థాపించాలని తపించారు. 2016లో ఏపీ స్టేట్ లెజిస్లేచర్ యాక్ట్-2016 ప్రకారం డాక్టరు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాయం ఏర్పాటు చేయడమే కాకుండా కర్నూలు నగరంలోని ఉస్మానియా కళాశాలలో తాత్కాలిక గదుల్లో ప్రారంభించారు. 2017-18 విద్యా సంవత్సరంలో ఉర్దూ, ఇంగ్లీష్, ఎకనామిక్స్ కంప్యూటర్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగాలు, 150 మంది విద్యార్థులతో బోధనకు శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం నాలుగు పీజీ గ్రూపులు సహా అండర్ గ్రాడ్యుయేట్ కోర్సులు అదనంగా ప్రారంభించారు. కర్నూలు, నంద్యాల, ఉమ్మడి అనంతపురం, చిత్తూరు, కడప, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి 500 మందికి పైగా విద్యార్థులు ఆయా కోర్సులలో పీజీ, డిగ్రీ చదువుతున్నారు. యూనివర్సిటీ అకాడమిక్ బ్లాక్ సహా హస్టళ్లు, పరిపాలన భవనాలు.. ఇలా అన్నింటికి 55-60 వేలకు పైగా చదరపు అడుగుల విస్తీర్ణం గల భవనాల అవసరం ఉంది. తాజాగా 22 వేల చదరపు అడుగులు విస్తీర్ణం కలిగిన ఓ ప్రైవేటు భవనంలో ఉర్దూ వర్సిటీ నడుతున్నారు. కనీస మౌలిక వసతులు లేక విద్యార్థులు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఢిల్లీ, నోయిడా, హరియాన్, ఉత్తరప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు ఈ వర్సిటీలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నా.. కనీస సౌకర్యాలు లేక రాలేకపోతున్నారు.


ఉర్దూ విశ్వవిద్యాలయం ప్రధాన రోడ్డు ఇలా వదిలేశారు

ఐదేళ్ల నిర్లక్ష్యం.. ఉర్దూ విద్యార్థులకు శాపం

గత జగన్ ప్రభుత్వం ఉర్దూ విశ్వవిద్యాలయంపై చూపిన ఐదేళ్ల నిర్లక్ష్యం ఉర్దూ వర్సిటీలో చదివే వందలాది మంది విద్యార్థులకు శాపంగా మారింది. దేశంలో రెండవ ఉర్దూ విశ్వవిద్యాయలం కోసం ఓర్వకల్లు విమానాశ్రయం పక్కనే అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం 144.92 ఎకరాలు భూములు కేటాయించింది. ఫేజ్-1 కింద అకడమిక్ బ్లాక్, బాలికల హాస్టళ్లు, విశాలమైన రోడ్ల నిర్మాణం కోసం చంద్రబాబు రూ.18 కోట్లు కేటాయించారు. హైదరాబాదుకు చెందిన యారో కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులను చేపట్టింది. అకాడమిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ 75 శాతం, ఫస్ట్‌ఫోర్ 25 శాతం పనులు చేశారు. బాలిక హాస్టళ్ల బేస్‌మట్టం, పిల్లర్ల వరకు నిర్మించారు. 2019 మేలో కొలుదీరిన జగన్ ప్రభుత్వం ఎక్కడి పనులు అక్కడే ఆపేసింది. ఆయన తీసుకొచ్చిన రివర్స్ టెండర్ల నిర్వహించి మళ్లీ పనులు మొదలు పెడుతారని ఆశిస్తే.. ఐదేళ్లలో ఒక్క ఇటుక పేర్చలేదు.. గంపెడు సిమెంట్ వేయలేదు. ఫలితంగా గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం.. విధ్వంస పాలనకు మూగసాక్షంగా మొండి గోడలు దర్శనం ఇస్తున్నాయి.

వర్సిటీ భూములు కొట్టేయాలనే కుట్ర

ఉర్దూ వర్సిటీకి కేటాయించిన 144.92 ఎకరాలు ఎంతో విలువైన భూములు. ఓర్వకల్లు రాక్ గార్డెన్ ఎదురుగా కర్నూలు-చిత్తూరు వయా నంద్యాల జాతీయ రహదారి పక్కనే ఉన్నాయి. ఈ భూములపై కన్నేసిన గత వైసీపీ ప్రభుత్వంలో కీలక హోదాలో నంబరు టూగా చక్రం తిప్పిన ఓ ప్రజాప్రతినిధి, జిల్లాకు చెందిన మరో ప్రజాప్రతినిధి కాజేయాలనే కుట్రలో భాగంగానే ఉర్దూ వర్సిటీ పనులు చేయకుండా ఆపేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో అప్పటి కలెక్టర్ అధ్యక్షతన యూనివర్సిటీలపై సమీక్ష సందర్భంగా ఉర్దూ వర్సిటీకి ఎంతో విలువైన వందల ఎకరాల భూములు అవసరమా..? ఈ యూనివర్సిటీని రాయలసీమ వర్సిటీలో విలీనం చేసి ఉర్దూ డిపార్ట్‌మెంట్ (విభాగం) పెడితే సరిపోదా..? అని ప్రజాప్రతినిధులు అన్నట్లు వర్సిటీ అధికారులే చెబుతున్నారు. దీనిని బట్టి చూస్తే ఉద్ధేశపూర్వకంగానే ఉర్దూ యూనివర్సిటీని నిర్లక్ష్యం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రూ.49 కోట్లు ఇస్తే..

అసంపూర్తిగా అకాడమిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్‌ఫ్లోర్, బాలిక హాస్టళ్లు, ఇంటర్నల్ రోడ్లు, ప్రహరీ నిర్మాణం, విద్యుత్, తాగునీరు, ఫర్నిచర్.. వంటి వాటికి తక్షణం రూ.49 కోట్లు అవసరం అని ఆంధ్రప్రదేశ్ ఎడ్యూకేషన్ అండ్ వెల్ఫేర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యూఐడీసీ) ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రి టీజీ భరత్, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు ఉర్దూ వర్సిటీపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. రాష్ట్ర మానవవనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్లి నిధులు, పరిపాలన అనుమతులు తీసుకురావాల్సి ఉంది. నిధులు ఇస్తే ఏడాదిలోగా పూర్తి చేసి విద్యార్థులకు అధునాతన సౌకర్యాలతో అందమైన భవనాలు అందిస్తామని అధికారులు అంటున్నారు. 2017-18లో పునాదిరాయి వేసి పనులు చేపట్టిన ఆనాటి టీడీపీ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి రావడంతో చంద్రబాబే పూర్తి చేసి విద్యార్థులకు అంకితం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.




కర్నూలు నగరంలోని అద్దె భవనంలో కొనసాగుతున్న ఉర్దూ విశ్వవిద్యాలయం

చరిత్రలో నిలిచిపోయేలా ఇసుక పాలసీ

- వైసీపీ నాయకుల అరాచకాలను నిగ్గు తేల్చాలి
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), జూలై 7: చరిత్రలో నిలిచేపోయేలా ఇసుక పాలసీ అమలుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందుకు చంద్రబాబు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో ఉచిత ఇసుక పాలసీ అమలుకు ఈనెల 8 నుంచి శ్రీకారం చుట్టారన్నారు. ఉచిత ఇసుక పాలసీ రాష్ట్ర అభివృద్ధిలో భాగమేనన్నారు. టన్ను ఇసుక కేవలం రూ.335కు డంప్‌ల వద్ద నుంచి తీసుకెళ్లవచ్చన్నారు. అదే గ్రామాల పరిధిలోని వాగులు, వంకల్లో ఉచితంగా ఇసుక గతంలోగే తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ఇసుక వల్ల నిర్మాణం రంగంపై ఆధారపడిన కార్మికులకు పనులు దొరు కుతాయన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ నాయకులు చేసిన ఆరాచకాలపై నిగ్గుతేల్చాల్సిన అవసరం ఉందన్నారు. జైలు, బెయిల్, విదేశాల్లో తలదాచుకునే పరిస్థితుల్లో జగన్ అనుచరులు పారిపోయారని ఎద్దేవ చేశారు.

చంద్రబాబు నాయకత్వాన పని చేయడం అదృష్టం

అధికారులు, మంత్రులను వెంటపెట్టుకుని వెళ్లి రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని కేంద్ర మంత్రులను చంద్రబాబు కోరుతున్నారని, అలాంటి నాయకుడితో పని చేయడం అదృష్టమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. రాష్ట్రంపై ఎంతో బాధ్యతతో సీఎం చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలతో నిరంతరం టచ్‌లో ఉంటూ రాష్ట్రానికి పనులు చేసి పెట్టాలని తమకు బాధ్యతలు కేటాయించడం ఆనందంగా ఉందన్నారు. రాయలసీమను కోస్తాలో పోటి పడే తీరులో ప్రాజెక్టుల తీసుకోచ్చి యువతకు ఉపాధి, రైతులకు నిరతరం నీటి సౌకర్యం కల్పించేకు అసరమైన ప్రణాళికలతో పని చేస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ముంతాజ్, కేవీ సుబ్బారెడ్డి, హనుమంతరాయచౌదరి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ఎంపీ బస్తిపాటి నాగరాజు

జిల్లా అభివృద్ధికి కృషి

బాధ్యతలు చేపట్టిన నంద్యాల కలెక్టర్ రాజకుమారి



నంద్యాల (కల్చరల్), జూలై 7: ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నంద్యాల జిల్లా అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. ఆదివారం ఉదయం 11:30 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకున్న నూతన కలెక్టర్‌కు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వేద పండితుల ఆశీర్వచనాలు, సర్వమత ప్రార్థనల అనంతరం ఉదయం 11:35 గంటలకు జి.రాజకుమారి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. నంద్యాల లాంటి మంచి జిల్లాకు మొదటిసారిగా కలెక్టర్ హోదాలో పనిచేసేందుకు అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానన్నారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్, కమాండ్ కంట్రోల్‌రూమ్, అన్ని సెక్షన్ల విభాగాలను కలెక్టర్ పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డీఆర్వో పద్మజ, ఆర్డీఓలు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జన సమూహంలోకి చిరుత

భయంతో పరుగులు తీసిన స్థానికులు

మహానంది, జూలై 7: కొంత కాలంగా మహానంది పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ భయాందోళనకు గురి చేస్తున్న చిరుతపులి ఆదివారం సాయంత్రం చీకటి పడకముందే జన సంచారంలోకి వచ్చేసింది. నల్లమల అటవీ ప్రాంతం నుంచి బయటకు వచ్చిన చిరుత ముందుగా క్షేత్రానికి సమీపంలోని పెద్ద నంది విగ్రహం వద్ద భక్తులకు కనిపించింది. దీంతో నందిని తిలకించేందుకు వచ్చిన భక్తులు, అటుగా వెళ్తున్న స్థానికులు చిరుతపులిని చూసి బెంబేలెత్తిపోయారు. వెంటనే చిరుత అక్కడి నుండి అటవీ పర్యావరణ విద్యా కేంద్రం మీదుగా దేవస్థానం ఉద్యోగుల కాలనీ సమీప ప్రాంతానికి వచ్చింది. దీంతో బయట ఉన్న కాలనీ వాసులు చూసి భయంతో ఇళ్లలోకి పరుగులు తీశారు. అటవీ శాఖ అధికారులు చిరుతపులిని బంధించి ప్రాణాపాయం నుంచి కాపాడాలని వారు కోరుతున్నారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు చిరుతపులి సంచరించిన ప్రాంతాన్ని పరిశీలించారు.

బీజేపీ వైపు.. బుగ్గన చూపు?





- పార్టీ మారేందుకు ప్రయత్నాలు
- కాషాయం జెండా కప్పుకునేందుకు పావులు
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి ద్వారా ప్రయత్నాలు?
- ఢిల్లీలోనే మకాం.. మాజీ సీఎం జగన్‌కు మరో దెబ్బ

డోన్, జూలై 7: ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో ఘోర పరాజయం చవి చూసిన వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌కు మరో దెబ్బ పడనుంది. డోన్ నియోజకవర్గానికి చెందిన మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి వైసీపీని వీడి, బీజేపీలో చేరేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ద్వారా పావులు కదుపుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. తన వ్యాపారాలను కాపాడుకునేందుకే బుగ్గన పార్టీ మారుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఈ పరిణామాలు వైసీపీలో కలకలం రేపుతున్నాయి. మాజీ సీఎం జగన్‌కు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అత్యంత సన్నిహితునిగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో మొదటిసారి డోన్ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందారు. అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ప్రతిపక్ష హోదాలో ఉన్న జగన్ పీఏసీ చైర్మన్ పదవిని బుగ్గనకు కట్టబెట్టారు. దీంతో అప్పట్లో అసెంబ్లీలో తనదైన ప్రసంగాలతో బుగ్గన జగన్‌కు మరింత దగ్గరయ్యారు. 2019 ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి వైసీపీ ఎమ్మెల్యేగా బుగ్గన రెండోసారి గెలుపొందారు. వైసీపీ అధికారంలోకి రావడంతో జగన్ కేబినెట్‌లో ఆర్థిక శాఖ మంత్రిగా బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి పని చేశారు. ఐదేళ్లు ఆర్థిక మంత్రిగా వైసీపీ ప్రభుత్వంలో బుగ్గన తిరుగులేని హవా కొనసాగించారు. పార్టీ ఓడిపోయాక ఆయన బీజేపీలో చేరేందుకు ప్రయత్నిస్తున్నారు.

కేంద్ర పెద్దలతో సంబంధాలు..

రాష్ట్ర ఆర్థిక మంత్రిగా పని చేసిన సమయంలో బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కేంద్రంలోని పెద్దలతో సంబంధాలు పెంచుకున్నట్లు చర్చ నడుస్తోంది. ముఖ్యంగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ వద్దకు నిత్యం ఫైళ్లను పట్టుకుని బుగ్గన వెళ్తూ కనిపించేవారు. రాష్ట్రానికి అప్పులు తీసుకురావడంలోనూ, కేంద్ర నిధులు రాబట్టడంలోనూ బుగ్గన ఎక్కువసార్లు ఢిల్లీ పర్యటనలు చేశారు. ఈ క్రమంలోనే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులతో సంబంధాలు పెంచుకున్నట్లు రాజకీయ వర్గాల సమాచారం. ఇటు గత వైసీపీ ప్రభుత్వంలో కీలకమంత్రిగా ఉండటం, అటూ కేంద్ర పెద్దలతోనూ సంబంధాలు పెంచుకున్న బుగ్గన తన వ్యాపారాలను విస్తరించుకున్నారు. రాష్ట్రంతో పాటు తమిళనాడు, బెంగళూరు, తెలంగాణలో మైనింగ్ వ్యాపారాలను పెంచుకోవడంతోపాటు సిమెంటు ఫ్యాక్టరీలను కొనుగోలు చేశారు. ఇలా బుగ్గన తన పలుకుబడితో పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తూ వచ్చినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

బీజేపీలో చేరేందుకు బుగ్గన యత్నాలు

రాష్ట్రంలో వైసీపీ ఓడిపోయిన తర్వాత మాజీ ఆర్థిక మంత్రి బుగ్గన పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. బీజేపీలోకి వెళ్లేందుకు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. వారం రోజులుగా బుగ్గన ఢిల్లీలోనే మకాం వేసినట్లు సమాచారం. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో బీజేపీలో చేరే విషయంపై ఇప్పటికే బుగ్గన సంప్రదింపులు జరిపినట్లు తెలిసింది. బీజేపీలోకి వస్తానని ఇప్పటికే కేంద్ర పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. బీజేపీలో చేరి తన వ్యాపారాలను కాపాడుకునేందుకు బుగ్గన తీవ్రస్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయవర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ పరిణామాలు వైసీపీలో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.



కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో బుగ్గన (ఫైల్)

రాజకీయాల్లోకి వద్దనుకున్నా

సినీ నటుడు సుమన్



విలేకరులతో మాట్లాడుతున్న సుమన్

ఆత్మకూరు, జూలై 7: గతంలో తాను రాజకీయాల్లో చురుగ్గా కొనసాగినప్పటికీ ఆ తర్వాత పలు కారణాలతో దూరంగా ఉన్నానని సినీ నటుడు సుమన్ అన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరైన సుమన్ కాసేపు విలేకరులతో మాట్లాడారు. తనకు ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావాలనే కోరిక ఉన్నప్పటికీ తన మదిలో మెదలాడే ప్రశ్నలకు సమాధానాలు దొరక్క అలాగే ఉండిపోయానన్నారు. అందులో ప్రధానంగా జైల్లో ఉన్న వ్యక్తులు ఎన్నికల్లో పోటీ చేయవచ్చు కానీ జైల్లో ఉన్న ఖైదీలకు ఓటు హక్కు ఎందుకు లేదో అర్థం కావట్లేదని అన్నారు. అలాగే ఎన్నికల్లో ఒక అభ్యర్థి రెండు చోట్ల పోటీ చేయాల్సిన అవసరం ఎందుకని..? ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానాలు దొరకడం లేదన్నారు. ఇలాంటి వాటిపై పాలకుల ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇకపోతే గత వైసీపీ పాలనలో పలు పథకాలు ప్రజలకు మేలు చేసేలా ఉన్నప్పటికీ కొన్ని విధానాలు నచ్చకే కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని సుమన్ అభిప్రాయపడ్డారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పరిపాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. రాష్ట్రంలో సినీ పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వ పెద్దలు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఏసుక్రీస్తు జీవిత చరిత్రతో కూడిన జీసస్ చిత్రంలో ప్రధాన పాత్రలో నటిస్తున్నట్లు సుమన్ వెల్లడించారు.

నేటి నుంచి ఉచిత ఇసుక పాలసీ

వెబ్ సైట్‌లో నిల్వల వివరాలు

కర్నూలు(అర్బన్), జూలై 7: ఉచిత ఇసుక పాలసీ ఈనెల 8 నుంచి అమలులోకి రానుందని గనుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. వివరాలను వెబ్ సైట్‌లో చూసుకోవాలని, ఏ డంప్‌లో ఎంత నిల్వ ఉన్నదీ చూసుకునేందుకు స్టాక్ వివరాలను ఆన్‌లైన్‌లో ఉంచుతున్నామని తెలిపారు.

లోక కళ్యాణార్థం జల కలశాలతో పాదయాత్ర



కలశాలతో యాగంటికి పాదయాత్రగా వెళ్లిన భక్తులు

బనగానపల్లె, జూలై 7: లోక కళ్యాణార్థం బనగానపల్లె పట్టణంలోని రవ్వల కొండలో వెలసిన హట్టిమునిస్వామి ఆశ్రమం నుంచి ఆదివారం జల కలశాలతో యాగంటి క్షేత్రానికి విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి దొంతా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వందలాది మంది మహిళలు పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్ర బనగానపల్లె నుంచి యాగంటిపల్లె, సాధుకొట్టం, మీరాపురం మెట్ట, పాతపాడు మీదుగా 11 కిలోమీటర్లు సాగుతుందని నిర్వాహకులు తెలిపారు.

అహోబిలంలో టీవీఎస్ కంపెనీ చైర్మన్



అహోబిలం పీఠాధిపతి రంగనాథయతీంద్ర మహాదేశికన్‌తో కలిసి హోమంలో పాల్గొన్న టీవీఎస్ కంపెనీ చైర్మన్ వేణు శ్రీనివాసన్

ఆళ్లగడ్డ, జూలై 7: టీవీఎస్ కంపెనీ చైర్మన్ వేణుశ్రీనివాసన్ ఆదివారం అహోబిలం శ్రీలక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో గడిపారు. అహోబిలంలో జరుగుతున్న జీర్ణోద్ధరణ, అష్టదిగ్బంధన, మహాసంప్రోక్షణ కార్యక్రమాల్లో జరిగిన హోమాల్లో పీఠాధిపతి రంగనాధయతీంద్ర మహాదేశికన్‌తో కలిసి పాల్గొన్నారు. ముందుగా పీఠాధిపతిని మర్యాద పూర్వకంగా కలిసి అహోబిలం అభివృద్ధిపై చర్చించుకున్నారు. అహోబిలానికి ఉదయం మద్రాసు నుంచి హెలికాప్టర్ చేరుకున్న వేణు శ్రీనివాసన్‌కు వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీలక్ష్మీనరసింహస్వామికి జరిగిన హోమాల్లో పాల్గొన్న ఆయన తిరిగి మధ్యాహ్నం మద్రాసుకు బయలుదేరివెళ్లారు. ఈయన రాకను పురస్కరించుకొని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో కొత్త కలెక్టర్



పూజలు నిర్వహించడానికి వస్తున్న కలెక్టర్ రాజకుమారి

మహానంది, జూలై 7: మహానంది క్షేత్రంలో నంద్యాల కలెక్టర్ రాజకుమారి దంపతులు ఆదివారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలెక్టర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మహానందీశ్వరుడి దర్శనం కోసం రాగా వీరికి ఆలయం ముఖద్వారం వద్ద వేదపండితులు, అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయాల్లో సాయంత్రం వేళల్లో నిర్వహించే మహామంగళ హారతుల సేవలో పాల్గొన్నారు. ప్రధాన గర్భాలయాల్లో స్వామి, అమ్మవార్లకు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక అభిషేకార్చనలు జరిపారు. కల్యాణ మంటపంలో కలెక్టర్ దంపతులను వేదపండితులు రవిశంకర్ అవధాని, హనుమంత్‌శర్మలు ఆశీర్వదించారు. ఆలయ ఏఈఓ వెంకటేశ్వర్లు శాల్వాతో సన్మానించి, పట్టు వస్త్రాలు అందజేశారు. మండల డిప్యూటీ తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



ధీరజ్‌రెడ్డి (ఫైల్)

ప్యాపిలి, జూలై 7: పట్టణ సమీపంలోని 44వ జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధీరజ్‌రెడ్డి(22) దుర్మరణం చెందాడు. మండలంలోని ఎర్రగుంట్లపల్లికి చెందిన వైసీపీ నాయకుడు పోతిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి కుమారుడు ధీరజ్‌రెడ్డి, అతని స్నేహితుడు రమేష్ తెల్లవారుజామున వెంగళాంపల్లి గ్రామానికి బైకుపై వెళ్లి తిరిగి ఎర్రగుంట్లపల్లికి బయలుదేరారు. బైపాస్ రోడ్డులో పెద్దమ్మ డాబా సమీపంలో ముందు వెళ్లుతున్న కారు సడన్ బ్రేక్ వేయడంతో వీరి బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ధీరజ్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను కర్నూలు ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం సుబ్బారెడ్డి, వైసీపీ నాయకులు బోరెడ్డి పుల్లారెడ్డి, బోరెడ్డి శ్రీరామిరెడ్డి, మెట్టు వెంకటేశ్వరరెడ్డి, గజేంద్రరెడ్డి, చిన్నసుంకయ్య, రాజామురళి, గడ్డం భువనేశ్వరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

ఆగస్టు 18 నుంచి రాఘవేంద్రుని ఆరాధనోత్సవాలు

మంత్రాలయం, జూలై 7: మంత్రాలయం రాఘవేంద్రస్వామి 353వ సప్త రాత్రోత్సవాలు ఆగస్టు 18 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మఠం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థుల ఆదేశాల మేరకు ఉత్సవాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఆగస్టు 18న ధ్వజారోహణ, ధాన్యపూజ, 19న శాఖోత్సవం, రజిత మండపోత్సవం, రుగ్వేద, యజుర్వేద ఉపాకర్మలు ఉంటాయని తెలిపారు. 20న ఉత్సవాల్లో ముఖ్యమైన పూర్వారాధన, అత్యంత ప్రాముఖ్యమైన 21న మధ్యారాదన, 22న మహారథోత్సవం (జాతర) నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 23న సుజ్ఞానేంద్రతీర్థుల ఆరాధన, 24న సర్వసేవ సమర్పణ, అనంతరం పీఠాధిపతి మహామంగళహారతులతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఏడు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకుని మఠం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, శ్రీపతాచార్‌లు ఏర్పాట్లపై సమీక్షలు చేస్తున్నారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని మఠం అధికారులను ఆదేశించారు. వసతి తాగునీరు, పరిశుభ్రత, ఉచిత అన్నదానం, క్యూలైన్లు, పరిమళ ప్రసాదం, స్నానపు ఘట్టాలు, వాహనాల పార్కింగ్, ఉచిత వైద్య శిబిరాల ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. ఉత్సవాల్లో భాగంగా యోగీంద్ర కళామండపంలో వివిధ రంగాల్లోని ప్రముఖులకు శ్రీరాఘవేంద్ర అనుగ్రహ ప్రశస్తి-2024 అవార్డులను పీఠాధిపతి ప్రదానం చేస్తారు. సంగీత దాసవాణి సాహిత్యం, శాస్త్రీయ సంగీతం, భరతనాట్యం, కూచిపూడి నృత్యాలు, వీణావాయిద్యం, వోకల్ సంగీతం తదితర పౌరాణిక కళారూపాలు ప్రదర్శిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇంజనీర్ సెక్షన్ ఈఈ సురేష్ కోనాపూర్, ఏఈ బద్రినాథ్‌లు భక్తులకు అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



రాఘవేంద్ర స్వామి మఠం మహా ముఖద్వారం

ఊరంతా కదిలొచ్చె..!

- పీర్ల దేవుడు పొలాల్లో ప్రత్యక్షమవుతాడంటూ మభ్యపెట్టిన బాలుడు
- బాలుడి వెంట భారీగా తరలిన ప్రజలు
- ఆలూరు మండలం కురువల్లిలో వింత ఘటన



బాలుడి వెంట తరలి వచ్చిన జనం



దేవుడిన చూపిస్తా అంటూ చెప్పిన బాలుడు



సంచిలో నుంచి తీసిన పీరును పోలిన కత్తి

ఆలూరు, జూలై 7: మెగాస్టార్ చిరంజీవి నటించిన స్నేహంకోసం సినిమాలో ఓ నటుడు కొండను ఎత్తేస్తాను అంటే ఊర్లోని జనం అంతా పోలోమని వెళ్తారు. సరిగ్గా అలాంటి సంఘటనే ఒకటి ఆలూరు మండలంలో చోటు చేసుకుంది. 'నాకు దేవుడు కనిపిస్తున్నాడు. పీర్లస్వామి మన ఊరిలోనే ఉన్నాడు. మన పొలాల్లోనే ఉన్నాడు... రండి చూపిస్తా..' అంటూ 12 ఏళ్ల బాలుడు చెప్పిన మాటలను ప్రజలు గుడ్డిగా నమ్మారు. వేలాదిగా ప్రజలు ఆ బాలుడి వెంట వెళ్లిన సంఘటన ఆదివారం సాయంత్రం ఆలూరు మండలం కురువల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఓ బాలుడు ఆదివారం ఉదయం నుంచి పూనకం వచ్చినట్లు నటించాడు. పూనకంలో భాగంగా చెప్పిన మాటలను ప్రజలు నమ్మేశారు. దీంతో సాయంత్రం తనతోపాటు రండి 'పీర్ల దేవుడిని చూపిస్తా..' అంటూ పిలుపునిచ్చాడు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కురువల్లి గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరూ వేలాదిగా తరలివచ్చారు. కొందరైతే సుదూర ప్రాంతాల నుంచి కార్లలో రావడం గమనార్హం. బాలుడి మాటలు విన్న జనం పొలాల వెంబడి బాలుడి వెంట పోలోమని పరుగులు తీశారు. ఓ పొలం వద్ద ఆగిన బాలుడు సమీపంలోని చెట్టు వద్దకు వెళ్లి తన సంచిలో ఉన్న పీర్లను పోలిన ఓ కత్తిని తీసి 'ఇదిగో దేవుడు...' అంటూ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఒక్కసారిగా ఖంగుతిన్న ప్రజలు జరిగిన తప్పుడు ప్రచారం, మోసాన్ని గుర్తించి బాలుడిని మందలించి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

మా స్థలాన్ని ఆక్రమించాడు

వైసీపీ నాయకుడిపై దళిత వృద్ధ దంపతుల నిరసన

నంద్యాల (నూనెపల్లె), జూలై 7: కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో 2011లో ఇచ్చిన సెంటు స్థలాన్ని వైసీపీ నాయకుడు, కూరగాయల మార్కెట్‌కు చెందిన కలాం అనే వ్యక్తి ఆక్రమించాడని బాధితులు ఆదివారం ధర్నాకు దిగారు. నంద్యాల పీవీ నగర్‌కు చెందిన సుబ్బరాయుడు, వెంకటసుబ్బమ్మ దంపతులకు వరద ముంపు బాధితుల కింద 2011లో కాంగ్రెస్ ప్రభుత్వం నంద్యాల మండలం సుగాలితండా సమీపంలో సెంటు స్థలాన్ని మంజూరు చేసింది. ఆరునెలల క్రితం వైసీపీకి చెందిన కూరగాయల మార్కెట్ కలాం తమ సెంటు స్థలాన్ని ఆక్రమించాడని వారు ఆరోపించారు. న్యాయం కోసం అప్పటి వైసీపీ ప్రభుత్వంలో స్పందనలో ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అన్నారు. వారం రోజుల క్రితం నంద్యాల తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్ళగా పరిశీలించిన రెవెన్యూ అధికారులు బాధితుల పేరు మీదనే ఆ స్థలం చూపించడంతో క్లియరెన్స్ ఇచ్చారు. అయినా మూడు రోజుల క్రితం కలాం అనే వ్యక్తి తమ స్థలంలో వేసుకున్న రేకుల షెడ్డు, నాపరాతి బండలను కూల్చి వేయడం జరిగిందని ఆరోపిస్తూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారాం నంద్యాల బొమ్మలసత్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట వృద్ధ దంపతులు న్యాయ దీక్ష చేపట్టారు. అనంతరం రాత్రి తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఎమ్మార్పీఎస్, ఎమ్మెఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్టేషన్ బయట బైఠాయించి తమకు న్యాయం జరగాలని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తాలూకా అర్బన్ సీఐ దస్తగిరికి ఫిర్యాదు చేశారు. విచారించి చర్యలు చేపడతామని బాధితులకు నచ్చజెప్పడంతో అక్కడి నుంచి వెనుదిరిగారు.

అధికారులు హాజరు కావాలి

సి. బెళగల్, జూలై 7: ప్రజా ఫిర్యాదుల సేకరణ కార్యక్రమానికి అధికారుల హాజరు కావాలని తహసీల్దార్ అనుపమ తెలిపారు. ఆదివారం తహసీల్దార్ అనుపమ మాట్లాడుతూ ప్రజలు సమస్యలు ఉంటే ఫిర్యాదు సేకరణలో వినతులను సమర్పించాలన్నారు. అధికారులు విచారణ చేసి సమస్యలను పరిష్కరిస్తారని తహసీల్దార్ తెలిపారు.

ఉచిత కంటి వైద్య శిబిరం


మాట్లాడుతున్న ప్రసాద్‌శర్మ

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: సుందరయ్య స్ఫూర్తి కేంద్రం అధ్వర్యంలో భరత్ ఆసుపత్రి సౌజన్యంతో లక్ష్మీనగర్ వికాస్ పాఠశాలలో సిరి, శ్రీదత్త మహిళా ఐక్యసంఘాల నిర్వహణలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి అనూహ్య స్పందన లభించినట్లు కేంద్రం నాయకులు ప్రసాద్ శర్మ తెలిపారు. ఆదివారం నిర్వహించిన వైద్యశిబిరంలో కంటి వైద్యులు డా.బి.స్వాతి కంటి పరీక్షలు చేసి మందులు సూచించారు. ఆప్తాలమిస్టు వి.రవి, టెక్నీషియన్లు బి.తరుణ్, కిరణ్‌కుమార్ వైద్యశిబిరంలో సహాయ సహకారాలు అందించారు. కార్యక్రమంలో కేంద్రం నాయకులు జేఎన్.శేషయ్య, రంగస్వామి, ఎల్లాగౌడు, శేషాద్రి పాల్గొన్నారు.

కార్మికుల ఉద్యోగుల భద్రతపై ఉద్యమించండి

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: మధ్యాహ్న భోజన కార్మికుల ఉద్యోగుల భద్రతకై ఉద్యమించాలని కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కే.భారతి పిలుపునిచ్చారు. ఆదివారం కేకే భవన్‌లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి అంజిబాబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టబోతున్న బడ్జెట్‌లో కార్మికులకు తన వాటాను ఖచ్చితంగా కేటాయించాలని డిమాండ్ చేశారు. తక్షణమే కార్మికులకు ఉద్యోగుల భద్ర కల్పించాలని లేదంటే నూతన ప్రభుత్వాలపై ఉద్యమ బాటకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాగేశ్వరరావు, లలితమ్మ, రజాయీ, సుజాత, రాజామని, అమ్మన్ని, లీలావతి, వెంకటేశ్వరమ్మ తదితరలు పాల్గొన్నారు.

● ముస్లింలపై గో మూక దాడులను ఖండించాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ అన్నారు. కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత దేశంలో పలుచోట్ల విద్వేషదాడులు,హింసాత్మక ఘటనలు పెరిగిపోయాయన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం గో మూక దాడులను చట్టపరంగా శిక్షించడానికి కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సమావేశంలో కార్యదర్శి షరీఫ్, తదితరులు పాల్గొన్నారు.

మురుగు కాలువల్లో పైప్‌లైన్ల తొలగింపు

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: నగరంలో మురుగు కాలువల వద్ద తాగునీటి పైప్‌లైన్ల క్రాసింగ్‌లను తొలగించి, సురక్షితమైన ప్రదేశాలకు మార్చేందుకు నగర పాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కమిషనర్ ఏ.భార్గవతేజ టెలికాన్ఫరెన్సు ద్వారా మాట్లాడుతూ నగర వ్యాప్తంగా మురుగు కాలువల వద్ద తాగునీటి క్రాసింగ్ పైప్‌లైన్లను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అదే విధంగా నీరు కలుషితం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాలలో డీఈఈలు గోపాలక్రిష్ణ, నరేష్, గిరిరాజు, కృష్ణలత, రాజశేఖర్, ఏఈఈలు పలు క్రాసింగ్ పనులను పరిశీలించారు. అనంతరం గుర్తించిన వాటిని తొలగించి ప్రత్యామ్నాయ ప్రదేశాల్లోకి మార్చేందుకు సంబంధిత అధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

నేడు నగర పాలకలో ఫిర్యాదుల స్వీకరణ

కర్నూలు(న్యూసిటీ), జూలై 6: నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటలకు ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఏ.భార్గవతేజ ఆదివారం తెలిపారు. నగర పాలకకు సంబంధించి ఏవైనా సమస్యలుంటే అర్జీ,ఆధార్, మొబైల్ నెంబర్లతో వచ్చి ఫిర్యాదు చేయవచ్చని, తద్వారా సమస్యకు సత్వరమే పరిష్కారం పొందవచ్చని కమిషనర్ పేర్కొన్నారు.

ఎంపీ బస్తిపాటి నాగరాజును కలిసిన నాయకులు


ఎంపీని సన్మానిస్తున్న నాయకులు

గూడూరు, జూలై 7: కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజును గూడూరు మండలం టీడీపీ నాయకులు కలిశారు. ఆదివారం మండలంలోని పెంచికలపాడు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు కరణం యుగంధర్, మధు, పోతురాజు మధు ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులు కర్నూలు తరలివెళ్లి ఎంపీ బస్తిపాటి నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూలమాలతో సత్కరించారు.

బీరప్ప స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం


నగదును నాయకులకు అందజేస్తున్న
నాగులాపురం సుంకన్న

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 7: జిల్లా కురువ సంఘం ఆధ్వర్యంలో పెద్దపాడు సమీపంలోని ఆదర్శ పాఠాల పక్కన నిర్మాణంలో ఉన్న బీరలింగేశ్వరస్వామి దేవాలయం నిర్మాణం కోసం గూడూరు మండలం కె.నాగులాపురం చెందిన సుంకన్న ఆదివారం రూ.44వేల చెక్కును విరాళంగా జిల్లా కురువ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లుకు అందజేశారు. వారు మాట్లాడుతూ దాతల సహకారంతో ఆలయ గోపురం నిర్మాణం, అమీలియో హాస్పిటల్ అధినేత డా.ప్రసాద్ సహకారంతో ప్రహరీ నిర్మాణం పూర్తయిందని, మిగతా పనులు ఉన్నాయన్నారు. దాతలు ముందుకు వచ్చి నిర్మాణానికి విరాళాలు అందజేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కొత్తపల్లె దేవేంద్ర, పెద్దపాడు పుల్లన్న, బీసీ తిరుపాలు, నగర అధ్యక్షులు తవుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

నగరంలో 4 గంటలు కరెంట్ కట్...

కల్లూరు, జూలై 7: కర్నూలు నగరంలో ఆదివారం 4 గంటలు విద్యుత్ కోత విధించారు. సంతోష్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని అశోక్‌నగర్, టీచర్స్ కాలనీలో సాయంత్రం నాలుగు గంటల నుంచి కరెంట్ సరఫరా లేక ప్రజలు అవస్థలు పడ్డారు. సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 7.50 గంటల వరకు విద్యుత్ సరఫరా లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. జంపర్‌కట్ కావడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందని ఏఈ ఉదయ్‌కుమార్ తెలిపారు.

గురువులను మరవద్దు: ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు(రూరల్)జూలై 7: గురువులు నేర్పిన విలువలు, సంస్కారంతోనే ప్రజాప్రతినిధి స్థాయికి ఎదిగానని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. కర్నూలు నగర శివారులోని విజ్ఞానపీఠం హైస్కూల్‌లో ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతు నాలుగు నుంచి పదో తరగతి వరకు ఈ పాఠశాలలోనే చదువుకున్నానని వివరించారు. ఇక్కడ గురువుల నేర్పిన విద్యాబుద్ధులు ప్రతి విద్యార్థికి ఉన్నత స్థాయికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఉపాధ్యాయులను ఎన్నటికి మరువనని, తనపై ఎంతో అభిమానంతో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసిన ప్రతి ఒక్కరికి రుణపడి ఉంటానన్నారు. తను చదువుకున్న పాఠశాలకు తనవంతు సహాయ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అనంతరం దస్తగిరిని భారీ ఘజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పిపి.గురుమూర్తి, హెచ్ఎం.వ్యాస్‌రాజు, ఉపాధ్యాయులు, రామిరెడ్డి, కళాకారుల సంఘం నాయకులు పత్తిఓబులయ్య, వెలుగుల సుంకన్న, పూర్వవిద్యార్థులు సీనియర్లు, జూనియర్లు తదితరులు పాల్గొన్నారు.


కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరిని సన్మానిస్తున్న
విజ్ఞనపీఠం స్కూల్ ఉపాధ్యాయులు

పందిపాడుకు మున్సిపల్ వాటర్ సరఫరా చేయాలి

కల్లూరు, జూలై 7: కల్లూరు అర్బన్ 28వ వార్డు పందిపాడు గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు శేఖర్‌చౌదరి, గ్రామస్తులు ఎమ్మెల్యే గౌరుచరితను కోరారు. ఆదివారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే స్వగృహంలో గౌరు చరితమ్మకు వినతిపత్రం అందించారు. పందిపాడులో కనీసం మౌలిక వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పాత పందిపాడు, హరిజనవాడ, బీసీ కాలనీ, బిఆర్ రెడ్డి కాలనీ, రమణ కాలనీలో తాగునీటి కొరత తీవ్రంగా వేదిస్తుందని మున్సిపల్ వాటర్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో సింగిల్ ఫేస్ కరెంట్ సరఫరాతో విద్యుత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని త్రీఫేస్ కరెంట్ సరఫరా చేసి మెరుగైన విద్యుత్ అందించాలన్నారు.


ఎమ్మెల్యే గౌరుచరితకు సమస్యలపై వినతిపత్రం ఇస్తున్న
పందిపాడు టీడీపీ నాయకులు

ఆత్మీయ సమ్మేళనాలు చేపట్టాలి

కర్నూలు(కల్చరల్), జూలై 7: జిల్లాలోని ప్రతి ప్రఖండ డివిజన్‌లో 'హిందూ ఆత్మీయ సమ్మేళనాలు' చేపట్టాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ పిలుపునిచ్చారు. ఆదివారం నగరంలోని నాగిరెడ్డి రెవెన్యూ కాలనీలోగల వీహెచ్‌పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి సమావేశంలో రమణ మాట్లాడుతూ విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆవిర్భవించి అరవై వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా, వీహెచ్‌పీ కేంద్రీయ సమితి ఆదేశాల మేరకు దేశ వ్యాప్తంగా ఆగస్టు 16 నుంచి ఆగస్టు 31 వరకు 'వీహెచ్‌పీ స్థాపనా దివస్' వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమ్మేళనాలకు అయోధ్య సమర్పణ అభియాన్‌లో పనిచేసిన కార్యకర్తలను, 'హితచింతక్', 'ధర్మ రక్షానిధి' ఇచ్చిన దాతలను, 'అయోధ్య అక్షింతల పంపిణీ'లో సహకరించిన హిందూ బంధువులను వారి కుటుంబాలతో సహా పాల్గొనేలా చూడాలని కోరారు. వీహెచ్‌పీ నగర అధ్యక్షుడు టీజీ మద్దిలేటి మాట్లాడుతూ నగరంలోని ఆరు ప్రఖండలలో ఈ హిందూ ఆత్మీయ సమ్మేళనాలు ఘనంగా నిర్వహించాలని, అందుకు ఉపఖండ కమిటీలను వేసుకోవాలని సూచించారు. వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి మాళిగి భానుప్రకాశ్ మాట్లాడుతూ జిల్లాలోని 12 ప్రఖండలలో, నగరంలోని 6 ప్రఖండలలో, గ్రామీణ స్థాయిలోని 6 ప్రఖండలలో సమ్మేళనాలు ఘనంగా నిర్వహించి హిందువుల ఐక్యతను చాటిచెప్పేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమాలకు కేంద్ర, రాష్ట్ర స్థాయి వీహెచ్‌పీ నేతలు హాజరుకానున్నారని తెలిపారు. ఈ సమావేశంలో వీహెచ్‌పీ, అనుబంధ సంస్థల నాయకులు సందడి మహేశ్వర్, విజయుడు, గిరిబాబు, ఈపూరి నాగరాజు, శివపురం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ

హామీలు నెరవేర్చే దిశగా చంద్రబాబు అడుగులు

కర్నూలు(అర్బన్), జూలై 7: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందుకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా చంద్రబాబు నేరవేరుస్తున్నాడని నగర టీడీపీ అధ్యక్షుడు నాగరాజు యాదవ్ అన్నారు. ఆదివారం నగరంలోని 43వ వార్డు ఇందిరా గాంధీ నగర్‌లో తెలుగు దేశం పార్టీ అధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. కర్నూలు అభివృద్ధికి రాష్ట్ర మంత్రి టీజీ భరత్ కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కే. ఏసన్న, వార్డు ఇంచార్జీ రాజశేఖరరెడ్డి, బూత్ ఇన్‌చార్జీలు రాము, నాగేశ్వరరావు, అంజనేయులు, భాస్కర్, వీరన్న, రవికుమార్ రెడ్డి, నరేష్, ఈశ్వరయ్య, వెంకటేశ్వరచౌదరి, అశోక్ కుమార్, లలితమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.


ఇందిరా గాంధీ నగర్‌లో
టీడీపీ జెండా అవిష్కరణ

నేడు బ్రాహ్మణ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా


మాట్లాడుతున్న సందేల్ చంద్రశేఖర్

కర్నూలు(కల్చరల్), జూలై 7: బ్రాహ్మణ కులస్థులను అవమానించిన కోడుమూరుకు చెందిన దాస్‌పాలే అనే వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తున్నట్లు వివిధ బ్రాహ్మణ సంఘాల నేతలు వెల్లడించారు. ఆదివారం నగరంలోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని దేవీ ఫంక్షన్ హాలులో బ్రాహ్మణ సంఘాల నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి వ్యవస్థాపక అధ్యక్షుడు సండేల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ దాస్‌పాలే బ్రాహ్మణ కులస్థులను టార్గెట్ చేస్తూ మాట్లాడటం బాధాకరమన్నారు. సమావేశంలో వివిధ బ్రాహ్మణ సంఘాల నాయకులు కొలుకుల చంద్రశేఖర్, దేవెళ్ల వసంత సాయినాథ శర్మ, టీవీ రవిచంద్ర శర్మ, సముద్రాల శ్రీధర్‌బాబు, కంచుగంటల శ్యామసుందర్‌రావు, మామిళ్లపల్లి రాజేశ్, రెంటచింతల సుధాకర్‌శర్మ, శంకర్‌దత్త, సునీల్ శర్మ, నరేష్ శర్మ, శివసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ముందస్తు కంటి పరీక్షలు అవసరం

● కంటి వైద్యులు డా.జేజే ప్రవీణ్


పరీక్షలు నిర్వహిస్తున్న కంటి వైద్యులు డా.జేజే ప్రవీణ్

కర్నూలు(హాస్పిటల్), జూలై 7: నలభైఏళ్ల దాటిన తర్వాత కంటి చూపు మందగించడం సహజమని, ప్రతి ఒక్కరూ ముందస్తు పరీక్షలు చేయించుకోవాలని ప్రముఖ కంటి వైద్యనిపుణులు డాక్టర్ జేజే ప్రవీణ్ అన్నారు. నగరంలోని కృష్ణానగర్‌లో కర్నూలు రిటైర్డు సీనియర్ సిటీజన్ సర్వీసు సొసైటీ జయలక్ష్మి ఐకేర్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. కంటి వైద్యులు జేజే ప్రవీణ్ 120 మంది విశ్రాంతి ఉద్యోగులు, పేదలకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగే వయస్సు కొంద్ది క్యాటరాక్ట్ సమస్యలు ఉంటాయనీ, ఐదేళ్లలోని లెన్స్ మసక బారడంతో చూపు తగ్గుతుందని, ఈ సమస్యకు సర్జరే పరిష్కారం అన్నారు. మధుమేహం అదుపు తప్పిన హెచ్చుతగ్గులకు లోనవుతున్న రెటీనా దెబ్బ తిని, రెటినోపతి సమస్య వస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్ వి.రఘువీర్, సొసైటీ అధ్యక్షులు జే.విశ్వేశ్వరయ్య, గౌరవాధ్యక్షులు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, కార్యదర్శి సీవీ సుబ్బారావు, పి.హనుమంతు పాల్గొన్నారు.

'దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం కల్పించేందుకు బీవీపీ కృషి'

కర్నూలు(కల్చరల్), జూలై 7: దివ్యాంగుల్లో ఆత్మ విశ్వాసం కల్పించేందుకు భారత్ వికాస్ పరిషత్ (బీవీపీ) సంస్థ గత పదేళ్లుగా కృషి చేస్తోందని బీవీపీ వికలాంగుల సహాయతా శిబిరం కన్వీనర్ రేగూరు బాలకృష్ణ అన్నారు. ఆదివారం నగరంలోని బుధవారపేటలోగల కేశవ్ మెమోరియల్ హైస్కూల్‌లో దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీకై 'దివ్యాంగుల సహాయతా శిబిరం' ఏర్పాటు చేశారు. రేగూరు బాలకృష్ణ మాట్లాడుతూ పుట్టుకతో పాటూ, వివిధ ప్రమాదాలవశాత్తు కాళ్లు చేతులు పోగొట్టుకున్న దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు సమకూర్చడంలో భారత్ వికాస్ పరిషత్ ఏటా అనేక కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ నుంచీ కృత్రిమ కాళ్లు, చేతులు తెప్పించి, ఆగస్టు రెండో వారంలో ఏర్పాటు చేసే కార్యక్రమంలో అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీవీపీ ఇతర ప్రతినిధులు లక్ష్మణస్వామి, కోదండరామయ్య, మురళీకృష్ణ, భయ్యావాసు, ఆనంద గురూజీ, బీవీపీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రీడా సాధనతో ఆరోగ్యం సురక్షితం


స్పైమార్షల్ ఆర్ట్స్ విద్యార్థులతో సీఐతో పాటు అతిథులు

కర్నూలు(స్పోర్ట్స్), జూలై 7: మార్షల్ ఆర్ట్స్‌లో ఒక భాగమైన స్పైమార్షల్ క్రీడ ద్వారా ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని మూడో పట్టణ సీఐ మురళీధర్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక బుధవారపేటలోని చేపలగుంట మైదానంలో ఏర్పాటు చేసిన స్పైవర్ మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారుల అభినందన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ప్రతిభా ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో జైభీమ్ దళిత వికాస సంస్థ అధ్యక్షులు జే.శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి డా.బాలకృష్ణ, సంఘం నాయకులు ఎన్‌జీ కృష్ణ, నాగరాజు, భాస్కర్ బాబు, రమేష్, 15వ వార్డు మాజీ కార్పొరేటర్ శివమ్మ, స్పైమార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి నబీ సాహెబ్, టి.గంగాధర్ పాల్గొన్నారు.

'రోపా' జిల్లా అధ్యక్షుడిగా చింతలపల్లి రామకృష్ణ ఎన్నిక



కర్నూలు(కల్చరల్), జూలై 7: రాయల అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (రోపా) కర్నూలు జిల్లా అధ్యక్షుడిగా చింతలపల్లి రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం నగరంలోని రోపా కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో రోపా సభ్యులు ఆయన ఎన్నిక ఏకగ్రీవం చేశారు. ఈ సందర్భంగా చింతలపల్లి రామకృష్ణ మాట్లాడుతూ 2008లో ప్రారంభించిన ఈ సంస్థ ద్వారా తులసి రామచంద్ర ప్రభు ఆధ్వర్యంలో పేద బలిజ మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ, బలిజ ఉద్యోగులు, ఇతర వృత్తి పనులు చేసుకునే వారికి చేయూతనందిస్తుందన్నారు. అలాగే 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన కాపు భవన్ నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. ఈ ఎన్నికల కార్యక్రమంలో ఎన్నికల ఆధికారిగా విశ్రాంత అధ్యాపకుడు బాలరాజు, కాపు, బలిజ ఉద్యోగ సంఘం రాష్ట్ర కార్యదర్శి, జిల్లా బలిజ సంఘం అధ్యక్షుడు కోనేటి చంద్రబాబు, రోపా అధ్యక్షుడు డాక్టర్ కొట్టే చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి గన్నపురెడ్డి శ్రీనివాసరావు, కోశాధికారి టి. గోపాల్‌రావు, కాపు సంక్షేమ సేన రాష్ట్ర కన్వీనర్ కోనేటి వెంకటేశ్వర్లు, నంద్యాల జిల్లా అధ్యక్షుడు దంతెల రమణ, ఇంపాక్ట్ కన్వీనర్ గోపీనాథ్, కాప్స్ రాక్స్ అడ్మిన్లు శైలేష్, పెద్దస్వామి, రోపా మాజీ అధ్యక్షుడు బీఏ శ్రీనివాసరావు, నాయకులు మలిశెట్టి దివాకర్‌రావు, కె. గురుప్రసాద్, మధుసూదనరావు, సీవీ శ్రీనివాస్, అమరం నరసింహారెడ్డి, గిరిబాబు, కొణిదెల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్షలో డిప్యుటేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 7: సమగ్ర శిక్ష విభాగంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల్లో డిప్యుటేషన్‌పై పని చేసేందుకు ఆసక్తి, అర్హత కలిగిన స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తుల చేసుకోవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి, సమగ్ర శిక్ష అదనపు (ఎప్ఏసీ) కోఆర్డినేటర్ కే.శామ్యూల్ ఆదివారం తెలిపారు. ఈ నెల 7వ తేదీ నాటికి 55 ఏళ్ల లోపు వయస్సున్న వారు సంబంధిత అధికారి ద్వారా జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. వివరాల కోసం rvmssakurnool.blogspot.in సందర్శించాలని డీఈవో తెలిపారు.

టీడీపీలో చేరిన వైసీపీ కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యుడు


విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన
వైసీపీ కౌన్సిలర్, కోఆప్షన్ సభ్యులు

గూడూరు, జూలై 7: గూడూరు నగర పంచాయతీకి చెందిన వైసీపీ కౌన్సిలర్ రత్నమ్మ కోఆప్షన్ సభ్యుడు పుట్టపాశం రామాంజనేయులు, జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఆదివారం గూడూరు పట్టణంలో నగర పంచాయతీ మాజీ వైస్ ఛైర్మన్ కురుకుంద రామాంజనేయులు, యువ టీడీపీ నాయకుడు రేమట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన కౌన్సిలర్ రత్నమ్మ, కోఆప్షన్ సభ్యుడు పుట్టపాశం రామాంజనేయులు, తిమ్మగురుడు స్వామి ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ ఎస్ఈ భాస్కర్‌తో పాటు 300 మంది వైసీపీ పార్టీ నుంచి కర్నూలు పట్టణంలోని టీడీపీ సీనియర్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. విష్ణువర్ధన్ రెడ్డి వీరికి తెలుగుదేశం పార్టీ కండువా కప్పి, పార్టీలోకి చేర్చుకున్నారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్ రెడ్డి టీడీపీ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. వైసీపీ కౌన్సిలర్ రత్నమ్మ, కోఆప్షన్ సభ్యులు రామాంజనేయులు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు జిల్లా టీడీపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులమై టీడీపీలో చేరామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ వైస్ ఛైర్మన్ రామాంజనేయులు, రేమట వెంకటేశ్వర్లు దండు సుందర్‌రాజు, కౌన్సిలర్లు కోడుమూరు షాషావలి, బుడ్డంగలి తదితరులు పాల్గొన్నారు.

'తల్లికి వందనం' ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం చేయాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 7: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం పథకాన్ని కేవలం ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు మాత్రమే వర్తింపజేయాలని డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ, జిల్లా అధ్యక్షులు వెంకట్రాముడు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక డీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు వర్తింపజేయడం వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు. పట్టణ, శివారు ప్రాంతాల్లో మురికివాడల్లో కొత్త ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించాలని 3, 4, 5 తరగతులను విలీన ప్రక్రియ 117 జీవోను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 20 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్న సర్వీసు రూల్స్‌ను సమస్యను పరిష్కరించి ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లు, డైట్ లెక్చరర్లు, ఉప విద్యాశాఖ అధికారుల పదోన్నతులు కల్పించాలన్నారు. సమావేశంలో డీటీఎఫ్ జిల్లా బాధ్యులు వీరన్న, పాటిల్, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశప్ప, చంద్రశేఖర్ యాదవ్, మండల బాధ్యులు చిన్న వీరేష్, వెంకటాచలం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీటీఎఫ్
రాష్ట్ర ఉపాధ్యక్షుడు కరెకృష్ణ

నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకు అప్పజెప్పాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 7: నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకు అప్పజెప్పేలా పార్లమెంటులో గళమిప్పాలని పీడీఎస్‌యు జిల్లా కార్యదర్శి మహేంద్రబాబు, జిల్లా ఉపాధ్యక్షులు రమణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నగరంలోని ఎంపీ కార్యాలయంలో ఎంపీ నాగరాజును కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ నీట్ పరీక్ష రాసే విద్యార్థులు మెడిసిన్ సీటు సాధించాలని ఎన్నో ఆశలు పెట్టుకుని పరీక్ష రాస్తే.. కేంద్ర ప్రభుత్వం ఎన్‌టీయే ఏజెన్సీకి అప్పజెప్పి రూ.లక్షలు అక్రమంగా నొక్కి పరీక్ష పేపరును లీకేజీ చేసి నీట్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్షను మరోసారి నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం కూడా నీట్ పరీక్ష పేపరు లీకేజీ పై సిట్టింగు జడ్జిలతో విచారణ జరిపించి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దశరథ రాముడు, నరేంద్ర, తేజ, తిరుమలేష్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.


ఎంపీ నాగరాజును కలిసి వినతి పత్రం
అందజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్), జూలై 6: ప్రజలు సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తంగా ఉండాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ అన్నారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్ గురుదత్త పాలిక్లినిక్‌లో ఆదివారం ఆయన నిరుపేదలకు సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకునేందుకు వీలుగా దుప్పట్లు, దోమతెరలను పంపిణీ చేశారు.


పేదలకు దోమతెరలు, దుప్పట్లను
పంపిణీ చేస్తున్న డా.శంకర్‌శర్మ

నగరంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

కల్లూరు, జులై 7: నగరంలో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-1 నాగప్రసాద్ తెలిపారు. సంతోష్‌నగర్, అశోక్‌నగర్ 11కెవి ఫీడర్‌ల పరిధిలో 33కెవీ తీగల ఏర్పాటు చేయనున్నందున కరెంట్‌కోత ఉంటుందన్నారు. ఈమేరకు అశోక్‌నగర్, లేబర్‌కాలనీ సమీపంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ-1 నాగప్రసాద్ తెలిపారు.

400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కోడుమూరు (రూరల్), జూలై 7: కోడుమూరు సెబ్ స్టేషన్ పరిధిలో వరుస దాడులు జరుగుతున్నాయి. ఆదివారం భారీగా బెల్లం ఊట ధ్వంసంతో పాటు 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. సీఐ మాట్లాడుతూ సంగాల గ్రామంలో మధు అనే వ్యక్తి నుంచి 15 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే చిన్నకొలుముల పల్లెలో 400 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి విచారణ చేపట్టినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్ఐ అలీబేగ్ సిబ్బంది హనుమంతు, వీరుపాక్షిరెడ్డి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.

సమ సమాజ నిర్మాతలు గురువులు

కర్నూలు(రాజ్‌విహార్ సర్కిల్), జూలై 7: ప్రతి ఒక్కరికి మంచి, చెడులను బోధిస్తూ, సత్సమాజ నిర్మాణానికి దోహదపడే వారే గురువులని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ప్రాంత ప్రచార ప్రముఖ్ బయ్యా వాసు అన్నారు. ఆదివారం గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వెంకటరమణ కాలనీలోని వెంకటేశ్వరస్వామి కల్యాణమండపం, దేవి ఫంక్షన్ హాలులో ఆర్.ఎస్.ఎస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గురుస్థానానికి వయస్సుతో సంబంధం లేదని, ఏ దశలోనైన గురువు మార్గదర్శకం అవసరమన్నారు. సోమ సుధీర్ మాట్లాడుతూ మన సంస్కృతిలో గురువుకు విశేష ప్రాధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో పుచ్చ వెంకట సుందరానంద, చల్లా వాసురెడ్డి, అశోక్ పాల్గొన్నారు.

విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించాలి

కర్నూలు(ఎడ్యుకేషన్), జూలై 7: ప్రభుత్వం విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను సత్వరమే పరిష్కరించి విద్యారంగాన్ని బలోపేతం చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.గోకారి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయు భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, విడుదల చేసిన జీవోల వలన ప్రభుత్వ, విద్యారంగాన్ని బలోపేతం చేసే నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఉన్నత పాఠశాలలో 3, 4, 5 తరగతులను ప్రాథమిక పాఠశాలలో కొనసాగించాలని, ఉన్నత పాఠశాలలో ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగును సమాంతర మాధ్యమంగా కొనసాగించాలని ఉపాధ్యాయులపై పని భారాన్ని, బోధనేతరకార్యక్రమాలను తగ్గించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

● 30 ఏళ్ల తరువాత గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో కలయిక



గోనెగండ్ల ఉన్నత పాఠశాలలో 1993-94లో పూర్వవిద్యార్థులు

గోనెగండ్ల, జూన్ 7: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం 1993-94లో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం అపూర్వంగా జరిగింది. 30ఏళ్ల తరువాత కలవడంతో కొందరు ఉద్వేగానికి లోనయ్యారు. నాటి ఉపాధ్యాయులను ఆత్మీయంగా గౌరవించారు. పాతికేళ్ల క్రితం వీరంతా ఈ పాఠశాలలో చదువుకొని ఉన్నత చదువుల కోసం విడిపోయారు. తరువాత ఉద్యోగాలు, సంసారజీవితంలో ఏళ్లు గడిచిపోయాయి. ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో 30ఏళ్ల తరువాత పూర్వవిద్యార్థులందరూ ఒకచోటికి చేరి ఆనందం పంచుకున్నారు. ఆత్మీయ పలకరింపుతో సందడి చేశారు. విద్యాబుద్ధులు చెప్పిన అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు హాజీమలాంగ్, బడేసానాయుడు, మునిస్వామి, దండుఖాజా, అమరేశ్వరప్ప, రాఘవేంద్రరరెడ్డి, మురళీరెడ్డి, ఈశ్వర్, షేక్షావలి, అక్బర్, అనురాధ, రాధాకుమారి, కస్తూరీబాయి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

వాన కోసం కప్పల పెళ్లి

ఆదోని, జూలై 7: సరైన సమయానికి వర్షాలు కురవాలని వరుణ దేవుడిని ప్రార్థిస్తూ కొత్తూరు గ్రామంలో రైతుల పిల్లలు ఆదివారం కప్పకు పెళ్లి చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో రోకలి బండకు వేపాకులతో కట్టిన జోలెలో రెండు కప్పలను ఉంచి, ఇంటింటికీ తిరుగుతూ సేకరించిన విరాళాలతో గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. వర్షం సమృద్ధిగా కురుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంబేడ్కర్ భవన్ ఎదుట వైఎస్సార్ విగ్రహం

● అడ్డుకున్న టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు



వైఎస్ విగ్రహ ఏర్పాటును అడ్డుకుంటున్న టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆలూరు, జూలై 7: పట్టణంలోని అంబేడ్కర్ భవన్ ఎదుట వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు వైసీపీ నాయకులు ఏర్పాట్లు చేస్తుండగా.. టీడీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు అడ్డుకున్నారు. ఆదివారం టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ నాయకులు నర్సప్ప, కొమ్ము రామాంజనేయులు, హనుమప్ప, ఉలిగప్ప, ఎమ్మార్పీఎస్ మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి ముత్యాల గాదిలింగ వైసీపీ నాయకులను అడ్డుకున్నారు. అంబేడ్కర్ భవన్‌కు ప్రహరీ మంజూరు అయ్యిందని, అలాంటప్పుడు ఈ భవన్ ముందు భాగంలో ఎలా విగ్రహం పెడతారని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో వైసీపీ నాయకులు చేసేదేమీ లేక వైసీపీ నాయకులు మాదన్న ఇంటి ముందు తాత్కాలికంగా వైఎస్ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు.

ఏళ్లు గడుస్తున్నా.. అన్నీ అక్కడే!

● పునర్ విభజనానంతర కష్టాలు
● సబ్ డివిజన్లు మారేదెన్నడో
● ఇబ్బందుల్లో మండల ప్రజలు



కోడుమూరు పోలీస్ సర్కిల్ నుంచి ఎమ్మిగనూరు సర్కిల్‌కు మారిన గోనెగండ్ల పోలీస్‌స్టేషన్

గోనెగండ్ల, జూలై 7: పరిపాలన సౌలభ్యతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు గాను ప్రభుత్వం నియోజకవర్గాల పునర్విభజన చేసింది. పునర్ విభజన జరిగి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ శాఖలు సబ్‌డివిజన్‌లు కొన్ని మారలేదు. దీంతో మండల ప్రజలు వివిధ ప్రభుత్వ శాఖ అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. 1984లో మండల వ్యవస్థ ఏర్పడింది. అప్పటి నుంచి గోనెగండ్ల మండలం పత్తికొండ నియోజక వర్గంలో ఉండేది. 2009 ఎన్నికలు ముందు జరిగిన నియోజక పునర్ విభజన లో గోనెగండ్ల మండలం పత్తికొండ నుంచి ఎమ్మిగనూరు నియోజకవర్గంలోకి మార్చారు. మండలానికి చెందిన పలు ప్రభుత్వ శాఖలు సబ్ డివిజన్ కార్యాలయాలు ఇప్పటికీ పత్తికొండలోనే కొనసాగుతుండటంతో పాలనా పరంగా నాడు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నేటికి తప్పడం లేదు. అలాగే కోడుమూరు కేంద్రంగా కొన్ని శాఖలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం గోనెగండ్ల మండలం ఆదోని డివిజన్‌లో ఉండగా సబ్ రిజిస్టర్ కార్యాలయం, రోడ్డు భవనాల శాఖ, ఉద్యానవన శాఖ, టెలికం శాఖ, కేంద్ర సహకార బ్యాంక్ మొదలైనవి కోడుమూరులోనే ఉన్నాయి. ఎక్సైజ్‌పోలీస్ స్టేషన్, ఐసీడీఎస్, సీడీపీవో సెక్టార్‌తో పాటు ఫారెస్టు సబ్‌డివిజన్, మెజిస్ట్రేట్ కోర్టు 70 కిలోమీటర్లు దూరంలో ఉన్న పత్తికొండలో ఉన్నాయి. వ్యవప్రయాసలతో వెళ్లి రావాల్సిన పరిస్థితి. దీని వల్ల సమయం వృథా అవుతోందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే మండలానికి సంబంధించిన ప్రభుత్వ శాఖల సబ్‌డివిజన్‌లను కోడుమూరు, పత్తికొండ శాఖల నుంచి ఎమ్మిగనూరుకు మార్చాలని కోరుతున్నారు. మరోవైపు మండలానికి సంబంధించి ట్రెజరీ, వ్యవసాయశాఖ, ట్రాన్స్‌కో శాఖలు ఎమ్మిగనూరులోకి మార్చారు. కోర్టు పని నిమిత్తం పత్తికొండకు వెళ్లిరావాలంటే పనిష్‌మెంట్‌లా ఉంటుందని ప్రజలు, అధికారుల వాపోతున్నారు. నియోజకవర్గ పునర్విభజన తరువాత హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇటీవల పోలీస్ శాఖను కర్నూలు డివిజన్ నుంచి ఎమ్మిగనూరుకు బదిలి అయ్యాయి. మిగిలిన శాఖలు కూడా ఎమ్మిగనూరుకు మార్చాలని ప్రజలు కోరుతున్నారు.



పత్తికొండకు వెళ్లిరావాలంటే చాలా ఇబ్బంది

కోర్టు పనిమీద పత్తికొండకు వెళ్లి రావాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఒక రోజు అంతా ఇదే పనికి కేటాయించాలి. అధికారులకు కూడా ఇబ్బందిగా నే ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించాలి.

- శ్రీనివాసులనాయుడు, గాజులదిన్నె



ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలి

నియోజకవర్గ పునర్విభజన చేసినప్పటికీ ప్రభుత్వం సబ్ డివిజన్‌లను మార్చక పోవడంతో ప్రజలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలి.

- నాయక్ షాషావలి, గోనెగండ్ల

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

● ఎమ్మిగనూరులో రూ.13.35లక్షల విలువచేసే విత్తన అమ్మకాలు నిలిపివేత
● మంత్రాలయంలో రూ.11.62 లక్షల ఎరువులు సీజ్
● 83.170 మెట్రిక్ టన్నుల అక్రమ నిల్వ



మాధవరంలో ఎరువులను సీజ్ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

ఎమ్మిగనూరు/మంత్రాలయం, జూలై 7: ఎమ్మిగనూరు పట్టణంలోని పలు ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల దుకాణాల్లో ఆదివారం స్టేట్ విజిలెన్స్, జిల్లా విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో విత్తనాలు, పురుగుమందులు, ఎరువులకు సంబంధించిన అనుమతి పత్రాలను చూపకపోవటంతో రూ. 13.35లక్షల విలువ చేసే విత్తనాలు, రూ. 95,200 విలువ చేసే ఎరువులు, పురుగు మందుల అమ్మకాలను నిలిపివేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన సమాచారం మేరకు.. రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిషన్ ఆదేశాలమేరకు స్టేట్ స్క్వాడ్ టీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్ సీఐ కేశవరెడ్డి. ఏడీఏ ఖాద్రి, ఏఓ దస్తగిరి రెడ్డి, స్థానిక ఏఓ మహేశ్వరరెడ్డి పట్టణంలోని త్రివేణి ఆగ్రో ట్రెడర్స్, దీప్తీ ట్రేడర్స్, మారుతి ఫెర్టిలైజర్స్, మానస ట్రేడర్స్, ధనుంజయ ట్రేడర్స్ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో త్రివేణీ ఆగ్రో ఎంటర్ ప్రైజెస్‌లో విత్తనాలకు సరైన రికార్డులను చూపకపోవటంతో రూ. 8,75,680 విలువ చేసే విత్తనాల అమ్మకాలను, అలాగే ధనుంజ ట్రేడర్స్‌లో రూ. 4,59,420 విలువ చేసే విత్తనాల అమ్మకాలను నిలిపి కేస్తు ఆదేశాల జారీ చేశారు. అలాగే మారుతి ఫెర్టిలైజర్స్‌లో రూ. 70,200 విలువ చేసే ఎరువులు, మానస ట్రేడర్స్‌లో రూ. 25వేలు విలువచేసే పురుగుమందుల విక్రయాలను నిలిపి వేస్తు విజిలెన్స్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

మంత్రాలయంలో రూ.11.62 లక్షల ఎరువులు సీజ్

మంత్రాలయం మండలంలోని మాధవరంలో శ్రీమారుతి ట్రేడర్స్ ఎరువుల దుకాణంలో విజిలెన్స్ అధికారులు ఆకస్మికగా దాడులు చేశారు. రాష్ట్ర అధికారి శ్రీనివాసరావు, మహ్మద్ ఖాద్రి, దస్తగిరి రికార్డులు, ఎరువులు, పురుగుల మందు నిల్వలను పరిశీలించారు. రూ.11,62,728 విలువ చేసే 83.170 మెట్రిక్ టన్నుల ఎరువుల అక్రమ నిల్వలను గుర్తించి వాటిని సీజ్ చేసి వాటి అమ్మకాలను చేయరాదని, వారి లైసెన్సును తాత్కాలికంగా సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అలాగే సరైన పత్రాలు సమర్పించకపోవడంతో 83.170 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేసినట్లు తెలిపారు. తనిఖీల్లో మండల వ్యవసాయాధికారి జీర గణేష్, ప్రొప్రైటర్ గూర్మింటి భీమిరెడ్డి పాల్గొన్నారు.

చెట్లను సంరక్షించాల్సిన అందరి బాధ్యత

● 1200 మొక్కలు దత్తత



6 (మాధవరం తండాలో మొక్కలు నాటుతున్న ఎంప్లాయిస్ గ్రూప్ సభ్యులు)

మంత్రాలయం, జూలై 7: ప్రతి ఒక్కరూ చెట్లను సంరక్షించడం బాధ్యతగా తీసుకొని మొక్కలు నాటాలని ఎం.తండా ఎంప్లాయిస్ గ్రూప్ సంస్థ అధ్యక్షుడు రాజశేఖర్ అన్నారు. ఆదివారం మండలంలోని మాధవరం తండాలో ఎంప్లాయిస్ గ్రూప్ సహకారంతో గ్రామ వీధుల్లో రోడ్డు కిరువైపులా సచివాలయం మైదానంలో 1200 మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఎంప్లాయిస్ గ్రూప్ తీసుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థులు కూడా హరితాంధ్రగా మార్చేందుకు సహకరించాలని, ప్రతి ఇంటికీ ఐదు చెట్ల ప్రకారం దత్తత తీసుకుని వాటిని పెంచి చెట్లుగా పెద్దదయ్యే వరకు సంరక్షించాల్సిన బాధ్యత తీసుకోవాలని సూచించారు. సర్పంచు పార్వతిబాయి, రంగనాయక్, చింతామణి, చంద్రలోక్ నాయక్, దాసప్ప పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు కొరత రానీవ్వొద్దు

● టీడీపీ నాయకులు రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, జూలై 7: నియోజకవర్గంలో విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదువుకునే సమయంలో బస్సు కొరత రానీయకుండా పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు ఎస్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. ఆదివారం మాధవరం తన నివాసంలో ఎమ్మిగనూరు డిపో మేనేజర్‌తో సమావేశమై బడి పిల్లలకు బస్సుల కొరత కారణంగా వర్షాకాలంలో కి.మీల పైబడి నడక సాగించాల్సిన పరిస్థితి ఉందని, దీనిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థులకు అనుకూలంగా బస్సులు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా కోసిగి మండలంలోని పల్లెపాడు, చింతకుంట గ్రామాల్లో బస్సు కొరత అధికంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రఘునాథరెడ్డి, రామక్రిష్టారెడ్డి, పల్లెపాడు వెంకట్రామిరెడ్డి, రమేష్, భూదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎంపీకి వినతి



ఎంపీ నాగరాజుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆస్పరి టీడీపీ నాయకులు

ఆస్పరి, జూలై 7: మండల ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కర్నూలు పార్లమెంటు సభ్యులు బస్తిపాటి నాగరాజును ఆస్పరి మండల టీడీపీ నాయకులు కోరారు. ఆదివారం తంగరడోణ టీడీపీ ఎంపీటీసీ నర్సప్ప, టీడీపీ నాయకులు కృష్ణ, మల్లికార్జున ఆధ్వర్యంలో ఎంపీ బస్తిపాటి నాగరాజును మర్యాదపూర్వకంగా కలిసి మండల ప్రజల సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు. ప్రధానంగా తాగునీరు, రోడ్ల సమస్యలతో పాటు రైతుకూలీల వలసల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో పెండింగ్‌లో ఉన్న గార్లపెంట నుంచి కైరుప్పల వరకు ఉన్న తొమ్మిది కిలోమీటర్ల రోడ్డును పూర్తి చేయాలన్నారు. జోహరాపురం వద్ద ఎస్ఎస్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని, వెంగళ్లయదొడ్డి చెరువు ఆధునీకరణ పనులు చేపట్టాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో మునిస్వామి, లింగమయ్య, రంగముని, బాలముని, నల్లారెడ్డి పాల్గొన్నారు.

ఖాతాదారులకు మరిన్ని సేవలు అందిస్తాం

ఆదోని టౌన్, జూలై 7: పట్టణంలో గత 27 సంవత్సరాలుగా ప్రజలకు సేవలు అందిస్తున్నామని, రానున్న రోజులలో ఖాతాదారులకు మరిన్ని సేవలు అందిస్తామని ప్రియదర్శిని అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మెన్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం బ్యాంకులో జరిగిన 27వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.53.59 కోట్ల డిపాజిట్‌లు కలిగి, రూ.30.30 కోట్ల వివిధ రుణాలను ఖాతాదారులకు అందిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో బ్యాంకు వైస్ చైర్మన్ మహేంద్రకర్ లక్ష్మణ్ రావు, డైరెక్టరులు జప దర్శన్ లాల్, కొంగే దీపక్, దశరథ రామిరెడ్డి, బ్యాంకు సీఈవో రమేష్ పాల్గొన్నారు.

నేడు గిరిజన పాఠశాల సీఆర్‌టీల విధుల బహిష్కరణ

ఆలూరు, జూలై 7: ఉమ్మడి జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సీఆర్‌టీలు సోమవారం విధులు బహిష్కరించనున్నారు. ప్రతి ఏటా వేసవి సెలవుల్లో సీఆర్టీల సర్వీస్‌లను నిలుపుదల చేసి, విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యాక తిరిగి రెన్యువల్ చేస్తారు. స్కూల్స్ ఆరంభమై నెల రోజులు గడిచినా, ఇంతవరకు వారి సర్వీసులు రెన్యూవల్ కాకపోవడంతో విధుల బహిష్కరణకు నిర్ణయం తీసుకున్నారు. 'రెండు నెలలు గడుస్తోంది. ఇంత వరకూ జీతాలు రాలేదు. కుటుంబాలను ఎలా నెట్టుకురావాలి' అంటూ సీఆర్‌టీలు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో కొలువుదీరిన ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం సీఆర్టీలను గుర్తించి సర్వీసులు కంటిన్యూ చేయాలని కోరారు. సోమవారం రాష్ట్ర గిరిజనశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యరాణిని కలిసి విన్నవించునున్నట్లు సీఆర్టీలు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

● ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు
● వాడవాడలా జెండావిష్కరణలు

ఆదోని (అగ్రికల్చర్), జూలై 7: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎంఆర్పీఎస్ జిల్లా నాయకులు నాగప్ప, మాదాసు జగన్ అన్నారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని పట్టణంలోని కాలనీలలో సంఘం జెండా ఎగరవేసి ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 30 ఏళ్లుగా వర్గీకరణ కోసం తమ నేత మంద కృష్ణ మాదిగ పోరాడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణ చేసి మాదిగలకు న్యాయం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. నాయకులు వీరేష్, బాలస్వామి, తిమ్మన్న, స్వామిదాసు, ఈరన్న, నారాయణ, నరసింహ, గణేష్, ఈశ్వర్, రవీంద్ర, సంజయ్, రాజు పాల్గొన్నారు.

ఆలూరు : ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆలూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక చెరువుకట్ట వద్ద మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా నాయకుడు ముత్యాల గదిలింగ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలూరు, చిప్పగిరి, హాలహర్వి నాయకులు శేఖర్, సుధాకర్, బాలరాజు, నెట్టికంటి, చిన్నరాయుడు, గంగాధర్, మహిళా అధ్యక్షురాలు కేంచమ్మ పాల్గొన్నారు.

కౌతాళం : మండల పరిధిలోని గుడికంబాలి గ్రామంలో ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవం, సంఘ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ 60వ జన్మదిన వేడుకలను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రాజబాబు, జిల్లా నాయకులు దుర్గప్ప సీనియర్ నాయకుడు ఆనంద్ మాదిగ, నరసింహులు, ముఖేష్, రాజేంద్ర, గాబ్రేల్, శ్రీనివాసులు పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో జెండా ఎగురవేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు : ఉమ్మడి తెలుగురాష్ట్రాల్లో మాదిగల ఆత్మగౌరవాన్ని పెంచింది మందాకృష్ణ నేతృత్వంలోని ఎమ్మార్పీఎస్ సంఘమని రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ చైతన్య అన్నారు. సంఘం కార్యాలయం దగ్గర ఉద్యోగలు సమాఖ్యా నాయకులు అంపయ్య జెండాను ఎగురవేశారు. ఆనంద్ చైతన్య మాట్లాడుతూ 30ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ అణగారిన వర్గాలకు అండగా నిలిచి వారి హక్కుల కోసం పోరాటం చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా మాదిగలు ఐక్యంగా హక్కుల సాధనకోసం ఉద్యమించాలన్నారు. నాయకులు పూలచింత పెద్దయ్య, శాంతిరాజు, పౌలయ్య, ప్రకాశం, ప్రభాకర్, దేవదాసు, నరసన్న, మారెప్ప, సోమన్న, బోయ శీను, గువ్వలదొడ్డి లింగన్నలు పాల్గొన్నారు.

మద్దికెర, జూలై 7: ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో మాదిగల ఆత్మగౌరవాన్ని పెంచింది ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలోనే అని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు బండెల ఆనంద్ కుమార్ అన్నారు. ఆదివారం మండలంలోని ఎం.అగ్రహారం గ్రామంలో మహాజన సోషలిస్టు పార్టీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ ఏర్పడి 30ఏళ్ల ఆవిర్భావం సందర్భంగా ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏబీసీడీ వర్గీకరణతో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల పదవుల అమలులో రిజర్వేషన్ అమలు వంటి కార్యక్రమాలు చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో రాము, ఈశ్వరయ్య, ఫక్కీరప్ప, మల్లికార్జున, నాగార్జున, రాజు, సూరి, బొమ్మనపల్లి రామాంజులు, రమేష్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఎల్లెల్సీ ఇలా.. పారేదెలా?



చెత్తాచెదారంతో మురుగు కాలువను తలపిస్తున్న ఎల్లెల్సీ

ఎమ్మిగనూరు టౌన్, జూలై 7 : ఎమ్మిగనూరు పట్టణ సమీపంలోని ఎల్లెల్సీ కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇటీవల ఇరిగేషన్ అధికారులు కొద్దిమేర తొలగించినా నీరు పారేందుకు వీలులేకుండా చెత్త చెదారం, పూడిక మేటవేసింది. తుంగభద్ర డ్యామ్ నుంచి ఎల్లెల్సీకి నీరు వస్తుండడంతో ఆ నీరు చేరుకునే లోపైనా పట్టణ శివారులోని ఫైర్ స్టేషన్ పరిధి నుంచి గుడికల్లు చెరువు వరకు కాలువలో పేరుకపోయిన చెత్త చెదారం, పూడికను తొలగించి పరిశుభ్రమైన నీరు అందించాల్సిన అవసరం ఎంతైనా వుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

వాల్మీకి విగ్రహానికి ఉద్యోగ సంఘం విరాళం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 7: మండలంలోని దొడ్డనకేరి గ్రామంలో వాల్మీకి విగ్రహ ఏర్పాటుకు వాల్మీకి ఉద్యోగ ఉపాధ్యాయ సంఘం నేతలు ఆదివారం రూ.20వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘం నేతలు రామలింగప్ప, వెంకన్న, నరసయ్య, నాగరాజు, సత్యన్న మాట్లాడుతూ గ్రామంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. భావితరాలకు వాల్మీకి మహర్షి గొప్పతనాన్ని చాటాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, వెంకటరెడ్డి, సుధాకర్, బాబు, భీమరాజు, రామాంజనేయులు కమిటీ సభ్యులు కిరణ్, గోవిందు, ఉరుకుందప్ప, రాజు పాల్గొన్నారు.

సంక్షిప్తం

పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకొండి

నందవరం, జూలై 7: గ్రామ పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈవోపీఆర్డీ ఈశ్వరయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అధికారులు, సచివాలయ సిబ్బంది సీజనల్ వ్యాధులు వస్తున్నాయని గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలన్నారు. డ్రైనేజీలను, వాటర్ ట్యాంక్‌లను ఎప్పుటికప్పుడే శుభ్రంగా ఉంచుకోవాలని, రోడ్ల పక్కన దిబ్బలు ఉన్న ప్రదేశాలను గుర్తించి రిపోర్టు తయారు చేయాలని ఆదేశించారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి: ఎస్టీయూ

నందవరం, జూలై 7: పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ బసవరాజు అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పెండంగ్‌లో ఉన్న జెడ్పీపీఎఫ్ రుణాలు, సంపాదిత సెలవులు, నగదీకరణ చెల్లింపులను ఇవ్వాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాని పునరద్దరించాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్ వెంటనే నియమించి మధ్యంతర భృతిని అమలు చేయాలన్నారు. ఆయనతో పాటు శంకర్, రాముడు, వెంకటేశ్వర్లు, సోమేష్ పాల్గొన్నారు.

గోనెగండ్లలో పారిశుధ్య పనులు

గోనెగండ్ల, జూలై 7: మండల కేంద్రంలో నాలుగు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపడుతున్నారు. మురికి కాలువలను శుభ్రం చేయడం, చెత్తను గ్రామ శివార్లకు తరలించడం, బ్లీచింగ్ పౌడర్ వీధుల్లో, మురికి కాలుల్లో చల్లుతూ దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామని, గ్రామంలో ఏదైనా సమస్య ఉంగే తమ దృష్టికి తేవాలని మేజర్ సర్పంచు హైమావతి, పంచాయతీ కార్యద ర్శి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్ కోరారు.

మొహర్రం వేడుకలు ప్రారంభం

గోనెగండ్ల, జూలై 7: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం పీర్ల చావిడిలలో పీర్లు కొలువయ్యాయి. కులమతాలకు అతీతంగా గ్రామ పెద్దలు పీర్ల చావిడి దగ్గరకు వెళ్లి మేళతాళలతో ఘనంగా పీర్లను ప్రతిష్ఠించి మొహర్రం వేడుకలను ప్రారంభించారు. ఈ వేడుకలను మండల ప్రజలు కులమతాలకు అతీతంగా జరుపుకుంటారు. ఆయా గ్రామాల్లో ప్రశాంతంగా పండుగను జరుపుకోవాలని పోలీసులు సూచించారు.

లక్ష్యంతో చదివితే విజయం సాధ్యం

ఆదోని (అగ్రికల్చర్), జూలై 7: విద్యార్థులు ఓ లక్ష్యం కలిగి చదువుకుంటే విజయం సాధిస్తారని ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదోని, కౌతాళం మండలశాఖల ఆధ్వర్యంలో పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. విదార్థులు సమయాన్ని వృథా చేసుకోవద్దని, కష్టపడితే ఉత్తమ ఫలితాలు సాధిస్తారు అన్నారు. అనంతరం విద్యార్థులకు ప్రతిభా పురష్కరాలను అందజేశారు. నాయకులు వెంకటేశ్వరులు, నాగరాజు, మహాదేవప్ప, సుంకన్న, రామకృష్ణ, రామాంజనేయులు, గోపాల్, రామచంద్ర, వెంకటస్వామి, సత్తన్న పాల్గొన్నారు.

చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారు

మద్దికెర, జూలై 7: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తుందని టీడీపీ సాధికారికత జిల్లా కన్వీనర్ ఎస్.లక్ష్మినారాయణ, తాలుకా తెలుగు యువత అధ్యక్షుడు ఈడిగ చంద్రశేఖర్‌గౌడు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని సీఎం నెరవేరుస్తున్నారని అన్నారు. మండలంలో నెలకొన్న సమస్యలను కేఈ శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్లామని, త్వరలోనే పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు బురుజుల జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే కాపులకు న్యాయం

తెలుగుదేశం అధినేత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోనే కాపులకు న్యాయం జరుగుతుందని రాయలసీమ కాపు కార్పొరేషన్ కన్వీనర్ వైపీ వీరన్న అన్నారు. సీఎం తర్వాత డిప్యూటీ సీఎం పదవి కాపు సామాజిక వర్గానికి చెందిన పవన్‌కళ్యాణ్‌కు ఇవ్వడంతో ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎం చంద్రబాబు ఫొటోతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఫొటో పెట్టాలని సీఎం ఉత్తర్వులు ఇవ్వడం అభినందనీయమని పేర్కొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

మండలంలోని కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని మండల సీపీఐ కార్యదర్శి నాగరాజు, మండల సీపీఐ సహాయ కార్యదర్శి మదనంతపురం హనుమన్న అన్నారు. ఆదివారం మద్దికెరలో సీపీఐ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయమే జీవనాధారంగా కౌలు రైతులు పంటలు సాగు చేసి నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించి వారికి కార్డులతో పాటు ప్రభుత్వం వ్యవసాయ రుణాలు, పంట రుణాలు అందించాలని కోరారు.

జనం సొమ్ము రాళ్లపాలు

● మూలనపడేసిన జగనన్న భూరక్ష రాళ్లు



పెరవలిలో సచివాలయం ఆవరణలో మూలనపడేసిన జగనన్న భూరక్ష రాళ్లు

మద్దికెర, జూలై 7: గత వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్మును ఎలా దుర్వినియోగం చేసిందనడానికి ఈ రాళ్లే నిదర్శనం. గత ప్రభుత్వంలో జగనన్న భూసంరక్షణ పథకం కింద భూముల రీసర్వేకి శ్రీకారం చుట్టారు. రీసర్వే చేసి హద్దులు తెలిపేందుకు రాళ్లను నాటాలని నిర్ణయించి సరఫరా చేశారు. అయితే, రైతుల నుంచి అభ్యంతరం రావడంతో ఆ రాళ్లను మూలన పడేశారు. వివరాల్లోకి వెళితే మండలంలోని బురుజుల, హంపా, బసినేపల్లి గ్రామాల్లో రీసర్వే చేసి జగనన్న భూసంరక్షణ పథకం కింద హద్దుల రాళ్లను తెప్పించారు. ఈ రాళ్లపై వైఎస్సార్ జగనన్న భూరక్ష అని చెక్కించారు. అప్పట్లో రీసర్వేపై రైతుల నుంచి పలు అభ్యంతరాలు వచ్చాయి. రాళ్లు పాతేందుకు రైతులు ఒప్పుకోకపోవడంతో సర్వే రాళ్లు పెరవలి సచివాలయ ఆవరణలో పెట్టారు. దాదాపు వెయ్యి రాళ్లకు పైగా ఉన్నాయి. ఒక్కొక్క రాయి విలువ దాదాపు రూ.200లకు ఉంటుందని అధికారులు తెలిపారు. ఈ రాళ్ల చూసిన ప్రతి ఒక్కరూ వైసీపీ ప్రభుత్వం ప్రజల సొమ్ము ఇలా రాళ్లపాలు చేయడం సరికాదని విమర్శిస్తున్నారు.